నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, సోమవారం 9 డిసెంబర్ 2024 | YADADRI BHUVANAGIRI

చౌటుప్పల్‌లో బారులుదీరిన వాహనాలు

హైవేపై వాహనాల బారులు

చౌటుప్పల్, డిసెంబర్ 8 : చౌటుప్పల్ పట్టణం లోని 65వ జాతీయరహదారిపై ఆదివారం వాహనాలు బారులు తీరాయి. సెలవు దినం కావడంతో పాటు శుభాకార్యాల నేపథ్యంలో రహదారులు రద్దీగా మారాయి. హైదరాబాద్ నుంచి నల్లగొండ వైపు ఈ వాహనాల తాకిడి నెలకొంది. ఆదివారం పట్టణకేంద్రంలో సంత ఉండటంతో వివిధ ప్రాంతాల నుంచి వ్యాపార నిమిత్తం ఇక్కడకు రావడం.. వివిధ వస్తువుల అమ్మకాలు, కొనుగోలు జరుగడంతో ఈ రద్దీ మరింత పెరిగింది. దీనికి తోడు సర్వీసు రోడ్ల వెంబడి డ్రైనేజీ నిర్మాణ పనులు జరుగుతుండటంతో వాహనాలు అక్కడ నుంచి ప్రయాణించడం కష్టంగా మారింది. ఈ క్రమంలో స్థానిక వాహనాలు కూడా జాతీయరహదారి ఎక్కడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. దీని దృష్ట్యా తంగడపల్లి క్రాసింగ్‌ను ట్రాఫిక్ పోలీసులు మూసివేశారు. సంస్థాన్‌నారాయణపురం వైపు వెళ్లే వాహనాలు వలిగొండ క్రాస్ రోడ్డు నుంచి యూటర్న్ తీసుకొని వెళ్లాయి. రానున్న రోజుల్లో ట్రాఫిక్ ఏర్పడకుండా సర్వీసు రోడ్డులో చేపడతున్న డ్రైనేజీ పనులు త్వరితగతిన చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, పక్కన రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి

కాంగ్రెస్ చేసిన పనులేవో చెప్పాలి

- కేసీఆర్, జగదీశ్‌రెడ్డితోనే జిల్లా అభివృద్ధి
- హెలికాప్టర్‌లో చెక్కర్లు కొట్టేవాళ్లకేం తెలుసు అభివృద్ధి గురించి
- మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, బీఆర్ఎస్ నేత చింతల

భువనగిరి అర్బన్, డిసెంబర్ 8 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన పనులనే ప్రారంభించి తామేదో గొప్పలు చేశామని, తమతోనే అభివృద్ధి జరుగుతుందని హంగామా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు ఆత్మ విమర్శ చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ అన్నారు. భువనగిరిలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో రూ.30వేల కోట్లతో ఏర్పాటు చేసిన యాదాద్రి పవర్‌ప్లాంట్‌ను ప్రారంభించి కాంగ్రెస్ హయాంలో జరిగినట్లు సభలు పెట్టడం, సంబురాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కేసీఆర్ సారథ్యంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి కృషితో నాడు పవర్‌ప్లాంట్‌కు నిర్మాణం చేస్తున్న సమయంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కమీషన్ల కోసం ప్రాజెక్టు నిర్మిస్తున్నారని అడ్డుకునే ప్రయత్నం చేశారని తెలిపారు. ఇప్పుడమే తామే నిర్మించినట్లు చెప్పుకోవడం సరికాదని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలోనే రూ.85వేల కోట్ల అప్పు ఎందుకు చేశారని, రాష్ట్రంలో ఎక్కడ ఏ ప్రాజెక్టు కట్టారో, ఎన్ని పథకాలు అమలు చేశారో చెప్పాలని ప్రశ్నించారు. కాళేశ్వరం, మల్లన్న సాగర్, కొండపోచమ్మ, బస్వాపూర్ రిజర్వాయర్‌ను బీఆర్ఎస్ హయాంలో ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం సస్యశామలంగా మారిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సుమారు రూ.5వేల కోట్ల అప్పుచేస్తే రూ.50 వేల కోట్ల ఆస్తులను రాష్ట్రానికి అందించిందని తెలిపారు. ఏ పథకాలు, ప్రాజెక్టులు అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు రూ.85వేల కోట్ల అప్పుచేసిందో చూపించాలని సవాల్ విసిరారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హెలికాప్టర్‌లో చెక్కర్లు కొట్టి ముసిరిపోతున్నారని, తానేమి అభివృద్ధి చేశారో ఈ జిల్లా ప్రజలకు తెలుసునని అన్నారు. రైతులకు ఇప్పటికి రెండు పంటలు పోయి మూడో పంట వస్తున్నా రైతుబంధు వేయలేదని, రూ.2లక్షల రుణమాఫీ కాలేదని, పింఛన్ల పెంపు జరుగలేదని విమర్శించారు. ప్రభుత్వం, మిల్లర్లు కుమ్మక్కై కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకుంటే దిక్కు తోచలేని పరిస్థితిల్లో రూ.2,300 బదులుగా రైతులు రూ.1800 అమ్మి రూ.500 నష్టపోయారని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలోనే 55 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ వేస్తే తామే ఇచ్చామని కాంగ్రెస్ అనడం విచిత్రంగా ఉందన్నారు. రాష్ట్రంలో 573 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటే కనీసం పరామర్శించడం కాదు, వారిని గుర్తించకపోవడం బాధాకరమని తెలిపారు. రాష్ట్రం వచ్చిన తర్వాత కేసీఆర్, ప్రొఫెసర్ జయశంకర్ సారథ్యంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడం సరికాదన్నారు. తెలంగాణ తల్లి విగ్రహానికి కిరీటంతోపాటు తల్లి రూపాన్ని రూపుమాపే విధంగా ఏర్పాటు చేయడంతో కాంగ్రెస్ చేసే పనులు సిగ్గుచేటుగా ఉన్నాయని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాల ప్రజలను ఆంధ్రా కబంధ హస్తాల్లో ఉంచేందుకు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో మూసీ ప్రక్షాళనకు రూ.20 వేల నుంచి రూ.30 వేల కోట్లు అవసరమవుతాయని ప్రతిపాదనలు రూపొందిస్తే, రేవంత్‌రెడ్డి సర్కారు రూ.1.50 లక్షల కోట్లు అవసరమని అంటుంటే ప్రజలను మోసం చేసి దోపిడి చేసే పనిగా ఉందన్నారు. మూసీ ప్రక్షాళనకు బీఆర్ఎస్ పార్టీ అడ్డురాదని, ప్రక్షాళన పేరుతో దోపిడీ చేస్తే అడ్డుకుంటామని, ప్రజలు తిరుగబడుతారని హెచ్చరించారు.

హామీలు అమలు చేయకుండా సంబురాలా? : బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన 6 గ్యారెంటీలు, 460 హామీలు అమలు చేయకుండా సంబురాలు జరుపుకోవడం సిగ్గుచేటని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సంవత్సరం నుంచి నయాపైసా పని చేయలేదని విమర్శించారు. రైతు బంధు, పెంచిన పింఛన్లు, రుణమాఫీ, రూ.500 బోనస్ హామీలను తుంగలో తొక్కి సంబురాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రాభివృద్ధి 26శాతం పెరిగిందని అనడం ఎంతవరకు నిజమని ప్రశ్నించారు. మాజీ సీఎం కేసీఆర్ అభివృద్ధిలో రాష్ట్రాన్ని దేశంలోనే ముందజలో ఉంచితే, కాంగ్రెస్ వచ్చిన తర్వాత వెనుకకు వెళ్లిందన్నారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ జీరోకు పడిపోయిందని తెలిపారు. రాష్ట్రాభివృద్ధిని పట్టించుకునే మంత్రులు లేరని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలనే సోయిలేదని, కానీ అభివృద్ధి జరిగిందని చెప్పుకోవడం సిగ్గుచేటుగా ఉందని మండిపడ్డారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్, బ్రాహ్మణవెల్లంలో ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేసింది బీఆర్ఎస్ హయాంలోనే అని గుర్తు చేసుకోవాలన్నారు. గత 10 సంవత్సరాల్లో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఉమ్మడి జిల్లాను అభివృద్ధిలో ముందంజలో ఉంచారని, జిల్లాలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇప్పటికి ఎన్నిసార్లు తిరిగాడో చెప్పాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే కాంగ్రెస్లోళ్ల వెంటపడి సాధిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ నోముల పరమేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జనగాం పాండు, పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు ర్యాకల శ్రీనివాస్, కుతాడి సురేశ్, వల్లపు విజయ్, రాసాల మల్లేశ్, సామల వెంకటేశ్, దండబోయిన బాల్‌రాజు, బాతుక అశోక్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంజీయూ వాలీబాల్ జట్టుకు ఎంపికైన ఉమ్మడి జిల్లా కళాశాలల విద్యార్థులు

ఎంజీయూ వాలీబాల్ జట్ల ఎంపిక

రామగిరి, డిసెంబర్ 8: మహాత్మాగాంధీ యూనివర్సిటీ పురుషులు, మహిళల వాలీబాల్ జట్టు ఎంపిక పోటీలను ఆదివారం వర్సిటీ స్పోర్ట్స్ గ్రౌండ్స్‌లో నిర్వహించారు. జిల్లాలోని అన్ని కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిని వర్సిటీ జట్టుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ హరీశ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్.మురళి, వై.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 22 వరకు యూనివర్సిటీ ఆఫ్ కేరళలో జరిగే జాతీయ స్థాయి సౌత్‌జోన్ వాలీబాల్ పోటీలకు పురుషుల జట్టును, జనవరి 6 నుంచి 11 వరకు తమిళనాడులోని జేపీఆర్ యూనివర్సిటీలో జరిగే మహిళా వాలీబాల్ పోటీలకు ఎంజీయూ మహిళా జట్టును ఎంపిక చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల పీడీలు, కోచ్‌లు పాల్గొన్నారు.

ప్రారంభించిన ప్రాజెక్టులన్నీ మా హయాంలోనివే..

సీఎం రేవంత్ రెడ్డి నల్లగొండకు వచ్చి ఒక్కరూపాయీ ఇవ్వలేదు

- బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టు ట్రయల్ రన్ గత మేలోనే చిరుమర్తి చేసిండు
- యాదాద్రి థర్మల్ ప్లాంట్, నల్లగొండ మెడికల్ కళాశాల నిధులన్నీ బీఆర్ఎస్ సర్కార్‌వే..
- ఏడాది కాలంలో ఇద్దరు మంత్రులు నల్లగొండకు చేసిందేమీ లేదు
- మీ ఇద్దరి మోసాలు బయటి పెట్టి త్వరలోనే భరతం పడతాం
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

నల్లగొండ బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, చిత్రంలో జడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, నోముల భగత్, పార్టీ నాయకులు

నల్లగొండ, డిసెంబర్ 8 : 'దామరచర్లలో ప్రారంభం చేసిన యాదాద్రి పవర్ ప్లాంట్, నల్లగొండలో ప్రారంభించిన మెడికల్ కళాశాల బీఆర్ఎస్ సర్కార్ నిధులతో చేపట్టినవే. మాజీ సీఎం కేసీఆర్ చలువతోనే ఈ రెండు ప్రాజెక్టులు రూపుదిద్దుకున్నాయి. ప్రారంభం చేసి మేమే చేశామని గొప్పలు చెప్పడం కాదు.. అసలు ఏడాది కాలంలో రేవంత్ ఈ జిల్లాకు ఇచ్చిన నిధులేమిటి? నల్లగొండకు వచ్చి ఒక్క శంకుస్థాపన కూడా చేయకుండా మా ప్రాజెక్టులు ప్రారంభం చేసి పోయాడే తప్ప ఒక్క రూపాయి ఇచ్చాడా ?' అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం రాక కోసం అయిన ఖర్చు అయినా నిధుల రూపంలో జిల్లాకు తేకపోవటంతో ప్రజలు నవ్వుకుంటున్నట్లు తెలిపారు. 2014లో అధికారంలోకి వచ్చినప్పుడు 7500మెగావాట్ల విద్యుత్ తెలంగాణలో ఉంటే 2027 నాటికి 24వేల మెగావాట్లు కావాలనే ఆలోచనతో దామరచర్లలో 4వేల మెగావాట్ల అల్ట్రా మెగా పవర్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేస్తే అందులో 800మెగావాట్లు అందుబాటులోకి వచ్చిందని, ఇది కేసీఆర్ ముందు చూపే తప్ప కాంగ్రెస్ చేసిందేమీ లేదని తెలిపారు. గతంలో కాంగ్రెస్ పాలనతోనే తెలంగాణ ఆగమైందని, దాన్ని గాడిలో పెట్టడానికే కేసీఆర్ ఎంతో కష్టపడాల్సి వచ్చిందని, దాన్ని తిరిగి ఈ ఏడాదిలోనే నాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు బంధు, రైతు బీమా, రుణమాఫీ ఇచ్చి రైతాంగాన్ని ఎంతో గొప్పగా ముందు వరుసలోకి తీసుకొస్తే రాష్ట్రంలో రుణమాఫీ పేరుతో రూ.30వేల కోట్లు ఎగ్గొట్టి రూ.12వేల కోట్లు మాత్రమే కాంగ్రెస్ చేసిందని, ప్రతి గ్రామంలో 30 నుంచి 35శాతం మంది రైతులకు మాత్రమే మాఫీ అయిందని, త్వరలో ఆధారాలతో నిరూపిస్తానని చెప్పారు. జిల్లాలకు వస్తే కేసీఆర్ ఏదో ఒక వరం ఇస్తాడని ప్రజలు అంతా నమ్మేవారని, ఇవ్వాళ రేవంత్ ఎక్కడికి వచ్చినా ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా నిత్యం బీఆర్ఎస్ వాళ్లను తిడుతూ మూడు తిట్లు.. ఆరు శాపనార్థాలతో వెళ్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత 12వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ వేసి అందులో ఐదు వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని, దాన్ని కప్పి పుచ్చి కేసీఆర్ హయాంలో వేసిన నోటిఫికేషన్లు కూడా తమ ఖాతాలో వేసుకొని తామే 55వేల ఉద్యోగాలు ఇచ్చామంటే నిరుద్యోగులు నవ్వుకుంటున్నారని విమర్శించారు.

మూసీ ప్రక్షాళనకు నడుం కట్టిందే మేము...

మూసీ వల్ల తాము ఇబ్బంది పడుతున్నామని, మురికి నీరు తాగాల్సి వస్తుందని నాడు కేటీఆర్‌తో చర్చించి 2వేల ఎమ్ఎల్‌డీ సామర్థ్యంతో 32 ప్లాంట్లు ఏర్పాటు చేసి శుద్ధి చేయడం మొదలు పెట్టింది బీఆర్ఎస్ హయాంలోనేని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి తెలిపారు. దుశ్చర్ల సత్య నారాయణ చేసిన పోరాటం కేటీఆర్‌కు వివరించి, నిధులు తీసుకొచ్చి శుద్ధి చేశామని, మూసీ ప్రక్షాళనను ప్రారంభించిందే తామని చెప్పారు. ఆ ప్రాజెక్టు తప్పనిసరిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. గోదావరి జలాలతో నల్లగొండను తడిపిందే బీఆర్ఎస్ సర్కారేనని, కాళేశ్వరంతో ఈ జిల్లాలో వేల ఎకరాలు సాగులోకి వచ్చిందని తెలిపారు. పదేండ్లల్లో రాష్ట్రంలో రెండున్న కోట్ల ఎకరాల్లో సాగు జరిగినందునే 3లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 40లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం దిగుబడి వచ్చినట్లు చెప్పారు.

చేసిన ప్రాజెక్టుకే మరోసారి ట్రయల్ రన్

బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు ట్రయల్ రన్ గత మే నెలలోనే మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఎమ్మెల్యే హోదాలో చేస్తే దాన్ని మళ్లీ సీఎంతో ట్రయల్ రన్ చేయించడం హాస్యాస్పదంగా ఉందని జగదీశ్‌రెడ్డి అన్నారు. తాము శంకుస్థాపన చేసిన పనులు తమ హయాంలోనే 90శాతం పూర్తి కాగా, వాటిని ఇప్పుడు మీరు ప్రారంభించి తమ ప్రాజెక్టులు అని చెప్పుకోవడం సిగ్గుగా ఉందని తెలిపారు. జిల్లాలో ఒక్క ప్రాజెక్టుకు అయినా ఈ ఏడాది కాలంలో ఒక్క శంకుస్థాపన చేశారా అని మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్‌ను ప్రశ్నించారు. అప్పట్లో ట్రయల్ రన్ చేయగానే కేటీఆర్, హరీశ్‌రావులకు కోమటిరెడ్డి సైతం కృతజ్ఞతలు చెప్పిన విషయం మర్చిపోయినట్లు ఉందని అన్నారు. ట్రయల్ రన్ చేసిన దాన్ని చేయడం కాదు, ఆ ప్రాజెక్టు కింద ఇంకా సాగు పెంచడానికి అదనపు నిధులు తెస్తే రైతులు హర్షిస్తారు తప్ప, చేసిన దాన్నే చేస్తే ఎవరూ నమ్మరని సూచించారు. ఇక ఎస్ఎల్‌బీసీ ఆలస్యం కావడానికి ఎవరు కారకులో, ద్రోహి ఎవరో, ఆ ప్రాజెక్టును ఆగం చేసిన దొంగ ఎవరో త్వరలో బయట పెడుతానని తెలిపారు.

ఇద్దరి మంత్రుల మోసాలు బయటపెడుతా..

అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇప్పటి వరకు ఒక్క శంకుస్థాపన కూడా చేయకుండా సొంత లాభం కోసం ఇద్దరు మంత్రులు పని చేస్తున్నారని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి ఆరోపించారు. నిత్యం మోసాలతో పాలన చేస్తున్న ఇద్దరు మంత్రులు ఎవరి దగ్గర ఏం తీసుకున్నారో, వారిని ఎలా మోసం చేస్తున్నారో చిట్టా మొత్తం తన దగ్గర ఉందని, త్వరలోనే వారి మోసాలు బయట పెడుతామని మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్‌ను దృష్టిలో పెట్టుకొని విమర్శలు చేశారు. జిల్లాలో త్వరలో మీ బాధిత సంఘాలు ఏర్పాటు అవుతాయని, ఇక మీ మోసాలు బయటపడే సమయం వచ్చిందన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం అనేది ఆనాడు అనేక మంది మేధావులు, కవులు, శిల్పులు, తెలంగాణ ఉద్యమకారులు తమ తల్లి ఎలా ఉండాలో అనేది నిర్ణయించి రూపొందించారని, ఇవ్వాళా రేవంత్ సర్కారు తయారు చేసిన రూపం తెలంగాణ తల్లిది కాదని, కాంగ్రెస్ తల్లిది అని అన్నారు. కాంగ్రెస్ తల్లిని తమ కాంగ్రెస్ కార్యాలయాల్లో పెట్టుకోవాలని, కానీ సచివాలయంలో పెడితే అంగీకరించేది లేదని చెప్పారు. ఈ సమావేశంలో నల్లగొండ మాజీ జడ్పీ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు, చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, నోముల భగత్, నాయకులు మందడి సైదిరెడ్డి, కటికం సత్తయ్య గౌడ్, రేగట్టె మల్లిఖార్జున్ రెడ్డి, బోనగిరి దేవేందర్, కరీం పాష, మాలె శరణ్యారెడ్డి, ఐతగోని యాదయ్య, మారగోని గణేశ్, అభిమన్యు శ్రీనివాస్, రావుల శ్రీనివాస్ రెడ్డి, కొండూరు సత్యనారాయణ, లొడంగి గోవర్ధన్ పాల్గొన్నారు.

పవిత్ర బాలాలయ ప్రాంతం స్వామివారి సేవకే వినియోగిస్తాం..

- కొండపైన 15 షాపుల మంజూరు అవాస్తవం
- స్పష్టం చేసిన గుట్ట ఈఓ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట, డిసెంబర్8 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి కొండపైన ఖాళీగా ఉన్న పవిత్ర బాలాలయ ప్రాంతాన్ని స్వామివారి సేవలకే వినియోగిస్తామని ఈఓ భాస్కర్‌రావు స్పష్టం చేశారు. ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా ఆరేండ్లపాటు స్వామివారి కైంకర్యాలు జరిగిన బాలాలయ ప్రాంతాన్ని ఆపవిత్రం చేసే ప్రసక్తి లేదన్నారు. ఆ ప్రాంతంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని తెలిపారు. ఆ ప్రాంతాన్ని ఆపవిత్రం చేయకుండా ప్రత్యేకమైన ఇనుప కంచెను నిర్మించి భద్రపరిచామన్నారు. కొండపైన మరో 15 షాపులు మంజూరైన్నట్లు వస్తున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. షాపులు పెంచే ప్రసక్తేలేదన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం అఖిల పక్షం నాయకులతో మాట్లాడారు. బాలాలయ ప్రాంతంలో రెండు కాంప్లెక్స్‌లో నిర్మించి కల్యాణ మండపం, ధాన్య మందిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. స్వామివారి నిత్య తిరుకల్యాణోత్సవాన్ని నిర్వహించేందుకు కల్యాణ మండపాన్ని వినియోగిస్తామని చెప్పారు. ధ్యానం, ప్రవచనాలు, కవి సమ్మేళనాలు, సంగీత విభేరి నిర్వహించేందుకు ధ్యాన మందిరాన్ని వాడుకునే విధంగా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఇందుకు దేవదాయ శాఖ అనుమతులను కోరిన్నట్లు తెలిపారు. అనుమతులు మంజూరైతే దేవాలయ నిధులతోనే నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. గతంలో మై హోం రామేశ్వర రావు బాలాలయ ప్రాంతంలో కాంప్లెక్స్ నిర్మిస్తామని త్రిదండి చినజీయర్‌స్వామితో వచ్చి కొబ్బరికాయ కొట్టి వెళ్లారని, దానిపై ఇంకా స్పష్టత లేదన్నారు. కొండ కింద నిత్యాన్నదాన సత్రాన్ని జనవరి 15న ప్రారంభించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయని తెలిపారు.

భువనగిరిలో నిర్వహించిన ప్రజా పాలన విజయోత్సవ సభలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

ప్రజాపాలన విజయోత్సవ సభ వెలవెల

యాదాద్రి భువనగిరి డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ) : ప్రజా పాలన విజయోత్సవాల సభ అట్టర్ ఫ్లాప్ అయింది. భువనగిరిలో నిర్వహించిన విజయోత్సవాల జిల్లా సభ జనం లేక వెలవెలబోవడంతో ప్రభుత్వం అభాసుపాలైంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. ఇందులో భాగంగా ఆదివారం భువనగిరి పట్టణంలోని జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో సభను అధికారికంగా ఏర్పాటు చేశారు. కలెక్టర్ హనుమంతరావు నేతృత్వంలో సభ కొనసాగింది. సభ ప్రారంభంలో జనం అరకొర కనిపించినా.. కొద్దిసేపటికే వేదిక ఖాళీ అయ్యింది. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే మందుల సామేల్ ప్రసంగించే సమయంలో ముందు వరుస మినహా అంతా ఖాళీగా దర్శనమిచ్చింది. ప్రభుత్వ ప్రజా పాలనకు ఈ సభ నిదర్శమని అక్కడున్నవారు పెదవి విరిచారు.

ముక్తాపూర్‌లో మిల్లులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న సివిల్ సప్లయ్ అధికారులు

రూ. 10 కోట్ల వడ్లు మాయం

- ప్రభుత్వానికి సీఎంఆర్ ఇవ్వని లక్ష్మీనరసింహ ఆగ్రో ఇండస్ట్రీస్
- మిల్లులో చిందరవందరగా ధాన్యం బస్తాలు
- తనిఖీలో గుర్తించిన సివిల్ సప్లయ్ అధికారులు

భూదాన్‌పోచంపల్లి, డిసెంబర్ 8 : కస్టమ్ మిల్లింగ్ రైస్ కోసం ప్రభుత్వం ఇచ్చిన 10 కోట్ల రూపాయల విలువ గల వరి ధాన్యాన్ని ఓ మిల్లరు పక్క దారి పట్టించిన ఘటన భూదాన్‌పోచంపల్లి మండలం ముక్తాపూర్ గ్రామ శివారులోని లక్ష్మీనరసింహ ఆగ్రో ఇండస్ట్రీస్‌లో జరిగింది. విజిలెన్స్, సివిల్ సప్లయ్ అధికారుల తనిఖీలో విషయాలు వెలుగులోకి వచ్చాయి. ముక్తాపూర్ గ్రామ శివారులో లక్ష్మీనరసింహ ఆగ్రో ఇండస్ట్రీస్ ఐదు ఎకరాల లీజు భూమిలో రైస్ మిల్లును ఏర్పాటు చేసింది. 2022-23 సంవత్సరంలో యాసంగికి సంబంధించిన 11,632 టన్నుల ధాన్యాన్ని సీఎంఆర్ కోసం సివిల్ సప్లయ్ శాఖ డిపార్ట్మెంట్ ఇచ్చింది. గత జనవరి నాటికి 1,440 టన్నుల వడ్లకు మాత్రమే సీఎంఆర్‌ను మిల్లు ఓనర్ శ్రీనివాస్ అందించాడు. వడ్లను ముందుగా ప్రభుత్వం టెండర్ వేయగా జిల్లా మిల్లులోని సీఎంఆర్ స్టాకును కేంద్రీయ బండారు సంస్థ యాక్షన్‌లో కొనుగోలు చేసింది. లక్ష్మీనరసింహ ఆగ్రో ఇండస్ట్రీస్‌కు ఇచ్చిన 10,192 వరి ధాన్యం ఉన్నాయి. అనంతరం వడ్ల సేకరణకు ప్రయత్నించగా మిల్లు ఓనర్ శ్రీనివాస్ 3,555 టన్నులకు సంబంధించిన డబ్బులను చెల్లించినట్లు తెలిసింది. రైస్ మిల్లును కూడా బంద్ చేశాడు. యాక్షన్‌లో వడ్లను కొనుగోలు చేసిన సంస్థ ఎన్నిసార్లు అడిగినా స్పందన లేదు. తనిఖీ చేసేందుకు వెళ్లిన విజిలెన్స్, సివిల్ సప్లయ్ అధికారులు రైస్ మిల్లులో ధాన్యాన్ని పరిశీలించి షాక్ తిన్నారు. వెంటనే రైస్ మిల్ యజమానికి ఫోన్ చేశారు. మిల్లులో అడ్డం దిడ్డంగా వడ్ల బస్తాలు పడి ఉండడం, ధాన్యం చిందరవందరగా ఉండడం, కోతులు, కుక్కలు మిల్లులో సంచరిస్తుండడం గమనించారు. వర్షానికి కొంత ధాన్యం తడిసింది. మిల్లు వద్ద ఎవరూ కాపలా లేరు. గేట్లు, షట్టర్లు తెరిచి ఉండడంతో ధాన్యం అస్తవ్యస్తంగా మారింది.

మిల్లులో యాసంగిలో సీజన్ ఇచ్చిన వడ్లలో 6,643 టన్నులు (1.65 లక్షల బస్తాలు) స్టాక్ ఉండాల్సి ఉండగా ఇందులో కేవలం 40 వేల బస్తాలు మాత్రమే నిల్వ ఉన్నాయి. మిల్లు యజమాని పది కోట్ల రూపాయల విలువ గల వరి ధాన్యాన్ని పక్క దారి పట్టించాడు. భూమి లీజుది కావడంతో మిల్లు ఓనర్‌కు ఎలాంటి సంబంధం లేదు. మిల్లులోని మిషన్ల అమ్మినా రూ.10 కోట్లు రికవరీ కాదని తెలుస్తుంది. మిల్లర్‌పై రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద కేసును నమోదు చేస్తామని సివిల్ సప్లయ్ డీఎం జగదీశ్‌కుమార్ తెలిపారు.